నవోదయకి ఎంపికైన శ్రీ నారాయణ విద్యార్థి

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో కోష్ట నారాయణ స్కూల్ జవహర్ నవో దయ విద్యాలయ సమితి వారు నిర్వ హించిన నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్షలో 8వ తరగతిలో సీటు కైవసం చేసుకున్న శ్రీ నారా యణ స్కూల్ కోష్ట విద్యార్థి ఆణిముత్యం కోనేటి సాయి దీపక్‌ను మండల విద్యాశాఖా ధికారి ఎ.త్రినాథరావు, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ ఎస్.గౌరునాయుడు మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

సురవరం మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : కమ్యూనిస్టు ఉద్యమంలో విప్లవకర నాయకత్వాన్ని ప్రదర్శించిన తెలుగు నాట విద్యార్థి, యువజన ఉద్యమం నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మూడు సార్లు విశిష్ట సేవలందించిన సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశంలో వ కార్మిక, కర్షక, విద్యార్థి-యువజన ఉద్యమాలకు తీవ్ర లోటు కలిగించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటనలో తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుమారు మూడు దశాబ్దాల పాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, తెలంగాణా ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సురవరం తన జీవితమంతా సమానత్వ సమాజం కోసం అంకితం చేశారన్నారు. ఆయన పోరాటాలు, ఆలోచనలు, సాధనలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, సీపీఐ వామపక్ష ఉద్యమాలు, కార్మిక-రైతాంగ పోరాటాల పటిష్టతకు సుధాకర్ రెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. ఆయన చూపిన మార్గదర్శకత్వం వలనే దేశవ్యాప్తం గా వామపక్ష శక్తులు పునరేకీకరణ వైపు, ఐక్య పోరాటాలకు బలమైన పునాది వేశాయన్నారు. ఆయన ఆశయాలను సాకారం చేయడం, కార్మిక, రైతు, సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగించడం సురవరం సుధాకర్ రెడ్డి ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకు వెళ్లడమే ఆయన కలల సమాజం అని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శ్రీకాకుళం జిల్లా కమ్యూనిస్టు సమితి తరపున సానుభూతిని వ్యక్తం చేశారు.

నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలి పెట్టు లాంటిది

ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : రోజురోజుకీ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా ప్రవేశపెడుతున్న మార్పులన్నీ ఉపాధ్యాయుల బోధన సమయాన్ని తగ్గిస్తున్నాయని ఉపాధ్యాయుడిని తరగతి గదికి దూరం చేస్తున్నాయని ఉపాధ్యా యుడి విద్యార్థి భాగస్వామ్యాన్ని తగ్గిస్తుందని ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు విద్యార్థులు విద్యా ప్రమాణాలను పెంచడానికి కాకుండా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం తగ్గించేందుకు అధికారులు తెలివితేటలు ఉపయోగిస్తున్నారు తప్ప ప్రభుత్వ పాఠశాల పై వీరికి చిత్తశుద్ధి లేదని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. నేడు ఆయన లక్ష్మీనర్సుపేట మండలంలో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బొర్రంపేట, శ్యామలాపురం, మల్లికార్జునపురం, చింతలబడవంజ, దొంకలబడవంజ, కరక వలస పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరకవలస నందు ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మదింపు విధానంలో భాగంగా తెచ్చిన అసెస్మెంట్ పుస్తకాల పేరిట మౌఖిక పరీక్షల్లో విద్యార్థి ప్రతిస్పందనల నమోదు కోసం ఉపాధ్యాయులు వందలాది పేజీలు రాయవలసి ఉంటుందని పరీక్షలు పూర్తి అయిన 10రోజుల వరకూ ఇవి రాయడానికి సమయం కావాలని ఇంకా బోధన చేయడానికి సమయం ఎక్కడదని పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడతామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు చేయదగిన పని ఇది కాదని వెంటనే మూల్యాంకన పుస్తకాల్లో మార్పులు చేపట్టాలని ఒకటి, రెండు తరగతులకు ఓఎంఆర్ బబ్లింగ్ ఉండకూడదని అపార్ ఐడి, పేపర్ కోడింగ్ బబ్లింగ్ తీసేయాలని మౌఖిక పరీక్ష ను ముందు పద్ధతిలోనే తరగతి గదిలో వారి ప్రతిస్పందన ఆధారంగా మార్కులు వేసే పద్ధతి ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం నూతనంగా భర్తీ చేయబోతున్న డీఎస్సీ పోస్టు విషయంలో ముందుగా మెరిట్ లిస్ట్ విడుదల చేసి ఆ తర్వాత సెలక్షన్ లిస్ట్ ప్రకటించి తర్వాత డీఎస్సీ నియామకాలు చేపట్టాలని డీఎస్సీ ప్రక్రియలో అభ్యర్థులకు ఉన్న అయోమయాలన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల నాయకులు పి.రామకృష్ణ, ఏ.వెంకట్, ప్రధానోపాధ్యాయులు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జిల్లాగా నామకరణం చేయండి

విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లాను విభజిస్తూ కొత్తగా ఏర్పడే జిల్లాకు గౌతు లచ్చన్న జిల్లాగా నామకరణం చేయాలని జనసేన డిమాండ్ చేసింది. జనసేన పార్టీ నేతలు ఈ మేరకు శనివారం పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే శిరీష సానుకూలంగా స్పందించినట్లు జనసేన నేతలు తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి తప్పకుండా గౌతు లచ్చన్న పేరు పెట్టాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీన ప్రదీప్, దూగాన దివాకర్, లింగబారి క్రాంతి, దూగాన సీసింద్రి, బొమ్మిడి తేజ, బంజు మనోజ్, ఆనింగి గణపతి, పొడుగు మణి, దూగాన శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా పిన్నింటి రవికుమార్

విశాలాంధ్ర - నందిగాం : నందిగాంకి చెందిన పిన్నింటి రవికుమార్ శ్రీకాకుళం జిల్లా లో స్కూల్ అసిస్టెంట్‌గా 5వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. గత పదేళ్ల కిందట తల్లి దండ్రులు మృతి చెందడంతో విశాఖ పట్నం వెళ్లిన రవి కుమార్ నేవీ స్కూల్లో కాంట్రాక్టు ఉపాధ్యా యుడిగా స్థిర పడ్డారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడాలన్న కోరిక నెరవేందన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిని తక్షణమే నియమించాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారిని తక్ష ణమే నియమించాలి అని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరే షన్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పూజారి హరి ప్రసన్న, పేడాడ కృష్ణారావులు డిమాండ్ చేశారు. సుమారు 25 రోజులుగా రెగ్యులర్ డిఇఓ లేక జిల్లాలో విద్యా వ్యవస్థ కుంటుపడుతుంది. ఇన్చార్జి డిఇఓ విధులు నిర్వహిస్తున్న కారణంగా ఎక్క డ ఫైళ్లు అక్కడే ఉన్నాయి. పలాస మండలంలోని ప్ర ధానోపాధ్యాయుల ఆగస్టు నెల ఇంక్రిమెంట్లు మంజూరు చేయకపోవడంతో పాత జీతంతోనే బిల్లులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీసాలకు, పాస్ పోర్టు ల నో అబ్జక్షన్ సర్టిఫికేట్ కొరకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు గత నెల రోజులుగా నిరీక్షిస్తున్నారు. జూలై 31వ తేదీన తిరుమల చైతన్య పదవీ విరమణ చేయ డానికి కొన్ని రోజుల ముందే కొత్త జిల్లా విద్యాశాఖ అధికారిని నియమించాల్సిన అధికారులు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఎసి) ఎవరికీ అప్ప జెప్పకుండా, రెగ్యులర్ డిఇఓను నియమించ కుండా తాత్సారం చేయడాన్ని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఖండిస్తు ప్రకటన విడుదల చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : పరిసరాల పరిశు భ్రతతోనే మనిషి సంపూర్ణమైన ఆరోగ్యం కల్గిఉంటాడని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీలో పాల్గొని, మూడవ శనివారం కాకుండా ప్రతీ రోజూ పరిశుభ్రతపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, కె.వేంకటేశ్వర ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఓ, ఎం.రేణుక, మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, వార్డు మెంబర్లు, బోయిన సతీష్, బతకల సంతోషి, గొలివి రామారావు, పిఏసిఎస్ డైరక్టర్, సరిపల్లి మధుసూధనరావు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, కింజారాపు రామారావు, అడపా చంద్రశేఖర్, శిమ్మ చంద్రశేఖర్, జామి వెంకటరావు, పీస కృష్ణ, తాళాభక్తుల గోవిందరావు, పూతి రమణ, బలగ ప్రహర్షకుమార్, పుచ్ఛల కల్పన, బలగ భారతి, బతకల గోపి, బోయిన ఆనందరావు పాల్గొన్నారు.

తేనేటీగలు పెంపకంతో ఆదాయం

విశాలాంధ్ర - కవిటి : రైతులు తమ కొబ్బరి తోటల్లో తేనేటీగలు పెంకకం ద్వారా ఆదాయాన్ని పొంద వచ్చునని, డీఆర్డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం కవిటి వెలుగు కార్యాలయంలో హంబుల్ బి కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు తేనేటీగలు పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనేటీగలు పెంపకం వలన కలిగే లాభాలను వివరించారు. రైతులు రూ. 82,525లు చెల్లిస్తే హంబుల్ కంపెనీ ద్వారా తేనేటీగలతో పాటు 10 తేనెపెట్టేలు, 13 రకాల పరికరాలు అందించి తేనె పరిశ్రమ ప్రోత్రహించేందుకు సహకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో హంబుల్ బి కంపెనీ ప్రతినిధి ఎ.ప్రభాకర్, ఎస్పివో ఏపీఎం ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మీ నర్సు పేట గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, వర్షాకాలంలో సంభ వించే అంటురోగాలు ప్రకృతి వైపరీత్యాలు పరిసరాలు పరిశుభ్రత గూర్చి అవగాహన మరియు ప్రతిజ్ఞ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సామాజిక వేత్త లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్ దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు సీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గురు దేవా ఛారిటీ బుల్ ట్రస్ట్ ప్రతినిధి లయన్.డా.ఎం.కె.మిశ్రో హెచ్.ఎం.బి.రమాదేవి ఉపాధ్యాయులు పి.లక్ష్మణరావు మరియు విద్యార్థి -విద్యార్థినీలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎస్ఐ కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర - మందస : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం మందస పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బంది స్టేషన్ పరిసరాలలో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వచ్ఛత-శుభ్రత విషయంలో ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించా లన్నారు. పరిసరాలు పరిశు భ్రంగా ఉంటేనే, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీపి కబురు

25న మెగా జాబ్‌మేళా

విశాలాంధ్ర - పలాస : పలాస నియోజకవర్గంలోని నిరుద్యో గులకు ఎమ్మెల్యే గౌతు శిరీష తీపికబురు నందించారు. ఈ నెల 25న మెగా జాబ్ మేళాను కాశీబుగ్గలోని సాయిశిరీష కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శిరీష తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 750కి మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటికే 500మందికి పైగా ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. అన్నదాతలకు సాగునీరందించి, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తుండడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ జాబ్‌మేళాలో రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక సంస్థలు అభ్యర్థులు ఎంపిక చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : గ్రామ స్థాయిలో తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు కృషి చేయాలని గ్రామాల్లో పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయం చేసి పార్టీని ప్రగతి పథంలో నడిపించాలని పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం పలాసలో టీడీపీ కార్యాలయంలో పలాస నియోజకవర్గం పరిధిలో గల మందస, పలాస, వజ్రపు కొత్తూరు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం పాలనలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న అంశాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. త్వరలో జరగబోయే సంస్థాగత ఎన్నికల్లో పార్టీ విజయం సాధించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిపిసి ఛైర్మన్ వజ్జ బాబురావు, ఏంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ ఛైర్మన్ వంకల కూర్మారావు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు లోడగల కామేశ్వరరావు యాదవ్, టిడిపి పట్టణ అధ్యక్షులు బద్ద నాగరాజు, జాలి కృష్ణారావు, గురుటి సూర్యనారాయణ, సప్ప నవీన్‌లతో పాటు మూడు మండలాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమనే పూజించాలి : బ్రహ్మశ్రీ సుధీర్ శర్మ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : భారత దేశంలో హిందువులు జరుపుకొనే పండగలలో అతి ముఖ్య మైన వినాయక చవితి పండగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో మట్టి వినాయక ప్రతిమల నే పూజించాలని, సంతబొమ్మాళి గ్రామ పురోహితులు బ్రహ్మ శ్రీ సుసరాపు సుధీర్శర్మ అన్నారు. స్వస్తిశ్రీ చాంద్రమానేనా శ్రీ విశ్వాసనామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితికి శివపార్వతుల కుమారుడైన గణపతి పుట్టిన రోజున వినాయక చవితి పండగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ ఏడాది 27తేది న గురువారం నుంచి వినాయక నవరాత్రులు జరుగుతాయన్నారు. ఈ పండగనే వినాయక చతుర్థి, గణేష్ చతుర్థి అని ఎన్నో పేర్లుగా పిలుస్తారు. అంతేకాకుండా ప్రతి నగరాల్లో బస్తీలు, కాలనీలో, గ్రామాలు, ఇంటి వద్ద అందరూ మట్టి వినాయకుని పూజించి కాలుష్యం నుంచి ప్రకృతిని కాపాడాలని సూచించారు. 1982 సంవత్సరంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన స్వతంత్రోద్యమంలో భాగంగా ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తిని రగిలించడంలో, వినాయక చవితి మహోత్సవాలు కూడా కీలకపాత్ర పోషించాయని, వినాయక చవితి ఉత్సవాలు మనస్వతంత్ర సమరయోధుడు లోకమాన్య తిలక్ ప్రారంభించారని తెలియజేశారు.

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం ప్రతి ఒక్కరిది కావాలి : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం ప్రతి ఒక్కరిదీ కావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం కల్లేపల్లి గ్రామంలో పరిసరాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా నిలపాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెలలో మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. నెలకి ఒకటి చొప్పున 12 నెలలకు 12 థీమ్‌లతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామా పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాపులు, రైల్వే స్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అంకితభావంతో భాగ్యస్వాములు కావాలన్నారు. ప్రధానంగా పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశు భ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడి దారులను ఆహ్వానించే రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడం, పిల్లలు, భవిష్యత్తు తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామా లలో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావులు, కుంటలు, చెరువులు, కాలువలు లోని వ్యర్థ పదార్థాలను తొలగించడంతోపాటు మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. అనంతరం స్వచ్ఛందర స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, ఈవోపీఆర్డి, రూరల్ మండలం అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

డీఎస్సీ జిల్లా మొదటి ర్యాంకర్‌ను అభినందించిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - మందస : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో 86.7 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంక్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ జోన్1లో జిల్లా 4వ ర్యాంక్ తో వరుసగా రెండు ఉద్యోగాలు సాధించిన మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి శంకర రావును శనివారం అంబుగాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలనే బలమైన పట్టుదలే నేడు జిల్లా మొదటి ర్యాంక్ సాధించి పెట్టిందని వారు అన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని శంకరరావు నిరూపించారని అన్నారు. తన ఇద్దరు పిల్లలు నివాన్, నిహన్వి లను ప్రభుత్వ బడిలో చేర్పించి ప్రభుత్వ ఉపాధ్యాయుల పట్ల నమ్మకం, విశ్వాసాన్ని పెంచారన్నారు. తను ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తూ పిల్లలని ప్రభుత్వ బడిలో చేర్పించి ఆదర్శవంతులు అయ్యారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, యువత శంకర రావు ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబుగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాసం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గున్న రమేష్, గొల్లంగి సాయమ్మ, దాసరి ఈశ్వరరావు, పత్రి ఈశ్వరరావు, సతీమణి ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శయన కార్పోరేషన్ రాష్ట్ర మాజీ ఛైర్మన్, డి.పి.దేవ్‌కు అస్వస్థత

పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి, ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర - నరసన్నపేట : రిటైర్డ్ తహశీల్దార్, శ్రీ శయన కార్పోరేషన్ రాష్ట్ర మాజీ ఛైర్మన్, డి.పి.దేవ్‌ను శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మాజీ మంత్రి, ధర్మాన ప్రసాదరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి, ప్రసాదరావుతో డి.పి.దేవ్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావటంతో శ్రీకాకుళంకు చెందిన పెన్షనర్ల సంఘం సభ్యులు, కుటుంబ సభ్యుల సహకారంతో ఆసుపత్రిలో చేర్పించి, యాంజియోగ్రామ్ నిర్వహించి, అనంతరం రెండు స్టంట్స్ వేయించడం జరిగిందని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డి.పి.ఓ, బంటుపల్లి కోటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు, చందు, రామకృష్ణ, ఆంజనేయులు, మోహనరావు, స్థానిక వైసిపి నాయకులు, రంగాజీ దేవ్, నక్క రామరాజు, రమేష్, హరిబాబు, పాపారావు, గిరి, రామలింగేశ్వరస్వామి, నందికేశ్వరరావు, నక్క శంకరరావు, శ్రీ శయన సంఘ నాయకులు, మెండ శాస్త్రి, శాంతమూర్తి, బంటుపల్లి కృష్ణ, లావేటి శ్యామ్, సొంగల ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, బుంగ సత్యన్నారాయణ, ఉంకిలి ప్రసాద్, మావూరు శేఖర్, గోపాలరావు పాల్గొన్నారు.

స్త్రీల స్వయం ఉపాధికి సరైన మార్గం టైలరింగ్ : వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం లో ఇటీవల ఏర్పాటు చేసిన టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ బిసి కోఆర్డినేటర్ మెట్ట చంద్రశేఖర్ తో పాటు లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు పర్యవేక్షించారు. ఈ సెంటర్ లో సమా వేశంలో మాట్లాడుతూ స్వయం ఉపాధికి సరైన మార్గం టైలరింగ్. అని వైస్ ఎంపీపీ కొత్తుగెడ్డ తులసి వరప్రసాద్ రావు అన్నారు మొదటి బ్యాచ్ పూర్తి అయ్యిందని తర్వాత బ్యాచ్ ఎప్పుడు ప్రారంభిస్తారని జిల్లా బిసి కోఆర్డినేటర్ గారిని లోతుగడ్డ తులసి వరప్రసాదరావు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం ట్రైనింగ్ పూర్తి అయిన బ్యాచ్‌కి కుట్టు మిషన్లు ఎప్పుడూ ఇస్తారో ఆరా తెస్తారు. టైలరింగ్‌తో పాటు మగ్గం వర్క్ వంటివి వాటిలో మహిళలకు ఉపయోగకరమైన రంగాల్లో ట్రైనింగ్ ఇప్పించవలసిందిగా కోరారు. ఇదే విధంగా తమరు మా మండల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

సేవకు ప్రతిరూపం శ్రీనివాసరావు

- పుట్టినరోజు సందర్భంగా పలు సేవా, అన్న, వస్త్ర, రక్తదాన కార్యక్రమాలు నిర్వహణ
- బెహర మనోవికాస కేంద్రంలో అల్పహారం అందజేత
- మహిళలకు చీరలు, ఆటోడ్రైవర్లకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : మంచితనానికి నిలువెత్తు రూపం.. నిస్వార్థ ప్రజా సేవకు ప్రతిరూపం..శ్రీకాకుళం ఆశాకిరణం.. సూర శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనునిత్యం ప్రజాసేవకే అంకితం అయిన సూర శ్రీనివాసరావు సేవకు ప్రతిరూపం అని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న క్రిస్టల్ ప్యాలెస్‌లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బెహర మనో వికాస కేంద్రంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు దేవాలయాల్లోనూ, క్రిస్టల్ ప్యాలెస్‌లో ముస్లీం, క్రైస్తవ సోదరులు కలసి సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరంలోని యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని తెలిపారు. తనపై చూపుతున్న అభిమానానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతుడినై ఉంటానని తెలిపారు. అనంతరం ఎచ్చెర్ల మండలం తోటపాలెం, చిలకపాలెం గ్రామాల్లో ప్రజలు సూర శ్రీనివాసరావుకు మంగళహారతులు, పూలదండలతో ఘనస్వాగతం పలికారు. సూర శ్రీనివాసరావు సేవలను కొనియాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ఈ రెండు చోట్ల కేక్ చేసి మహిళలకు అందజేశారు. అలాగే తోటపాలెం ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మీ గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాలిటెక్నిక్ కళాశాలలో 50 మొక్కలను ఈ సందర్భంగా నాటారు. మొక్కలను సంరక్షించాలని కళాశాల సిబ్బందికి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అలాగే సుమారు 1000 మంది మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సేవలు విస్తృతం చేసిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు మాట్లా డుతూ ధనవంతులు ఎందరు ఉన్న పేదలకు సేవ చేయాలన్న తలంపు మాత్రం కొందరికే ఉంటుందని, అటు వ్యక్తుల్లో సూర శ్రీనివాసరావు ఒకరని తెలిపారు. ఎందరో నిరుపేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తూ వారి ఎదుగుదలకు సహకరించడం గొప్ప విషయమన్నారు. తన పుట్టినరోజున ప్రజల మధ్యే ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. రచయిత లోకనాథం, ట్రాఫిక్ సీఐ నాగరాజుతో పాటు నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత పెద్ద ఎత్తున హాజరై సూర శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మాత్రం ఏనాడూ మరిచిపోలేదన్నారు. పేదలకు చేసే సేవలోనే తనకు నిజమైన సంతృప్తి లభిస్తుందని చెప్పారు. ప్రతీ ఏటా నిర్వహించే తనకు అభిమానులు పెరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు.

కోదండ రామ ఆలయ చైర్మన్‌గా ఆనంద్

విశాలాంధ్ర - సోంపేట : పట్టణంలోని పురాతన కాలంగా ఎంతో విశిష్టత కలిగి భక్తులకు అపారమైన విశ్వాసం కలిగిన చిన్న కోమటి వీధిలోగల శ్రీకోదండరామ స్వామి ఆలయం నూతన కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన బీన ఆనంద్‌ను ప్రభుత్వం నియమించింది. అపారమైన దైవభక్తి, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉన్న ఆనంద్‌కు చైర్మన్ పదవి అప్పగించేందుకు సీనియర్ నేత, ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌లు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

చైర్మన్‌గా ఆనంద్ నియామకం పట్ల సోంపేట పట్టణంతో పాటు మండలంలోని టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్యదీపిక ప్రతినిధులు ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.

రైతుల ఉసురు ఈ ప్రభుత్వానికి తగలక మానదు

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆమదాలవలస : రైతు కంట కన్నీరు కార్చితే, ఆ కన్నీటి ఉసురులో ఉద్దండులైన పాలకులు కొట్టుకుపోయిన చరిత్ర ప్రజా స్వామ్య పాలనలో లిఖించబడి ఉన్నదని మాజీ స్పీక ర్ తమ్మినేని సీతారామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ మై మూడు నెలలు గడిచిన ఇప్పటికి, వ్యవసాయ సాగుకు అవసరమయ్యే ఎరువులు కొరత కూటమి ప్రభుత్వంలో కొట్టుకొచ్చినట్లు కనిపిస్తుందని ఆయన అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతాంగం చేసిన తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. నియోజక వర్గలలో రైతాంగానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాల్సిన ఎరువులు కూడా సకాలంలో అందించకపోవడం దారుణం అన్నారు. బహిరంగ మార్కెట్లో కూడా ఎరువుల కొరత సృష్టించి, బ్లాక్ మార్కెట్ దందాలకు పాల్పడటం దారుణమైన చర్య అన్నారు. తన రాజకీయ చరిత్రలో ఇటువంటి దుస్థితి ఎప్పుడు చూడలేదన్నారు. ఎరు వులు కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితులు రావడం, కూటమి సర్కార్ పాలనా వైఫల్యానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల సమస్యలపై గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇదే విషయమై రెండు మార్లు మీడియా సమావేశం నిర్వహించి రైతుల పడుతున్న బాధలను వివరించడం జరిగిందన్నారు. ఇది ముమ్మాటికీ పాలకుల వైఫల్యమే అని తమ్మినేని మండిపడ్డారు. ఆముదాలవలస నియోజకవర్గంలో ప్రభుత్వం నుండి వస్తున్న ఎరువులను టిడిపి నేతల స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు అదే విధంగా పక్కదారి పడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అయి నప్పటికీ క్షేత్రస్థాయిలో కనీసం అధికారయం త్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

రైల్వే గోడౌన్ వద్ద కు వెళ్ళేటప్పుడు ఉద్రిక్తత, పోలీసులు అదుపులో మాజీ స్పీకర్...

శనివారం ఎరువులు వ్యాగన్ ఆమదాలవలస రైల్వే గోడౌన్ కు చేరుకున్న విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రైతుల తరఫున నిరసన తెలిపేందుకు సిద్ధపడ్డారు. ఇదే సమయంలో పోలీసు లు తమ్మినేని నివాసానికి చేరుకున్నారు. రైల్వే వ్యాగన్ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ ద్విచక్ర వాహనంతో రైల్వే గోడౌన్ వద్దకు చేరుకుంటున్న సమయంలో తమ్మినేనిని పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా అటువైపు వెళ్ళనీయకుండా నిలువరించి పోలీస్ జీప్ లో ఎక్కించి తమ్మినేని ని తన నివాసానికి తరలించారు. అనంతరం తన నివాసం వద్ద తమ్మినేని మీడియాతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎరువులను ఆముదాలవలస కేంద్రంగా రైల్వే వ్యాగన్ నుండి సరఫరా చేయటం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాలకు, ఎరువుల డీలర్లకు ఇక్కడినుండే సరఫరా జరుగుతున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాతే ఎరువుల కొరత జిల్లాలో నెలకొంది అన్నారు. వైసిపి పాలనలో ఎటువంటి ఎరువులు కొరత ఏర్పడలేదు అన్నారు. రైల్వే గోడౌన్ కు వచ్చిన ఎరువులు పక్కదారి పడుతుంటే, అధికార యంత్రాంగం కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే, రైతాంగానికి అవసరమయ్యే విధంగా ఎరువులు అందించకపోతే 2000 మంది రైతులతో ప్రజా పోరాటానికి సిద్ధమని తమ్మినేని ప్రకటించారు.

ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలి

విశాలాంధ్ర - రణస్థలం : శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్ రెవెన్యూ డివిజనల్ అధికారి సబ్ డివిజనల్ పోలీసు వారు, రైతులకు అందిస్తున్న యూరియా అనుమతి లేకుండా పరిశ్రమలకు తరలిస్తున్నారనే అంశం పై ప్రభుత్వ ఆదేశాలు మేరకు శనివారం, రణస్థలం మండలం లోని చిల్ల పేట రాజాం గ్రామం లో ఉన్న వనం ప్లై ఉడ్ ఇండస్ట్రీస్, మరువాడ గ్రామం లో ఉన్న త్రిమూర్తి ప్యానెల్ ప్రొడక్ట్స్ పరిశ్రమ మరియు బంటుపల్లి గ్రామంలో ఉన్న యునైటెడ్ బ్రీవరీస్ పరిశ్రమ ను క్షేత్ర స్థాయి లో తనిఖీ చేయడం జరిగింది. తనిఖీల్లో భాగంగా పరిశ్రమాల్లో ఉన్న అధికారులకు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, లేనియెడల కఠిన చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ రణస్థలం, వ్యవసాయ అధికారి రణస్థలం వారు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.సింహాచలం నాయుడు మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంలో భారతదేశం దూసుకు పోతుందని, ప్రపంచంలో అతి తక్కువ దేశాలకే ఈ విజ్ఞానం ఉందని అన్నారు. అంతరిక్ష విజ్ఞానం భారతదేశము కలిగి ఉండడం గొప్ప విషయం అన్నారు. మనదేశంలో అంతరిక్ష పరిశోధనకు బడ్జెట్లో చాలా నిధుల్ని కేటాయిస్తున్నారని, దానిని ఉపయోగించుకొని ఎక్కువ సంఖ్యలో ఉపగ్రహాలను ప్రయోగిస్తోందని అన్నారు. ప్రపంచంలో చాలా దేశాలకు తక్కువ అంతరిక్ష విజ్ఞానం కలిగి ఉండడం వల్ల,అటువంటి దేశాల యొక్క ఉపగ్రహాలను భారతదేశం తీసిపోయి అంతరిక్షంలో ప్రవేశపెడుతుందని అన్నారు. ఈరోజు దేశాభివృద్ధి అంతరిక్ష విజ్ఞానంతో ముడిపడి ఉందని అన్నారు. వాతావరణ మార్పులు,సముద్రంలో వస్తున్న మార్పులు, సమాచార వ్యవస్థ మొదలగునవి అన్ని కూడా అంతరిక్ష విజ్ఞానంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానం పట్ల అవగాహన పెరిగి,ఆ రంగంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఒ.జే. పాపారావు, జి.విష్ణుమూర్తి, పి. శ్రీహరి, కె. ఉగాది నాయుడు, బి. శ్రీనుబాబు. కే. కరుణశ్రీ, డి. రమేష్, జనార్దన్ రావు, ఎల్. ఆనంద్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు ఎదుట రైతుల ఆవేదన

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలోని స్థానిక ఎరువుల దుకాణాలు వద్ద శనివారం రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న కొన్ని ఎరువుల దుకాణాలలో యాజమాన్యాలు కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు ఎరువులను, పురుగు మందులను విక్రయిస్తున్నారని సాగుదారులు దుకాణాలు వద్ద నిరసన చేపట్టారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి ఎరువుల దుకాణాలు పరిశీలనకు వెళ్ళిన సమయంలో రైతులు పడుతున్న సమస్యలపై ఆర్డీఓకు తెలుపుతూ తమ ఆవేదనను వ్యక్తం చేసుకున్నారు. ప్రపంచానికే రైతు ఎన్నుముకని, ఆ రైతుల సమస్యలు ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని, రైతులు ఉంటేనే ప్రతి ఒక్కరూ నేడు బ్రతికి ఉన్నారని నేడు ఆ రైతుకి కష్టం వస్తే ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని అధికారులపై రైతులు వాపోయారు. పొలాలలో పంటకు సిద్ధం చేసుకుని సీజన్ వచ్చిన సమయంలో రైతులకు యూరియా పొటాషియా డీఏపీ సరైన సమయానికి అందివ్వకపోతే పంటలను రైతులు ఎలా పండిస్తారు అని అధికారులకు ప్రశ్నించారు. రైతులకు ఆదుకునే ప్రభుత్వం ఉండాలి గాని, ఆదుకోకపోయినా ఏ ప్రభుత్వమైనా రైతన్నలకు ఒకటేనని మండిపడ్డారు. ఏది ఏమైనా ఇప్పటికైనా రైతులు పడుతున్న సమస్యలపై స్పందించి రైతులకు కావాల్సిన ఎరువులు, యూరియా, డి ఏ పి, పొటాషియా వంటివి వెంటనే అందజేయాలని కోరుతున్నారు. రైతులు పడుతున్న సమస్యలు గురించి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేశారు.

వర్సిటీలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నివారణ తదితర అంశాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ తొలి బాధ్యతగా క్యాంపస్ ను తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు స్వచ్ఛ ఆంధ్ర క్యాంపస్ నోడల్ అధికారి డాక్టర్ డి.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జీతాలు పెంచాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలో అం గన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో శనివారం నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనిభారం పెరిగిన మేరకు అం గన్వాడీలకు వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. అంగన్వాడీలకు డీఏ, పీఆర్సీ అమలుచేయడంలేదని, సంక్షేమ పథకాలు కూడా వర్తింపజేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, చంద్రమౌళి, యు.శారద, రాములమ్మ, రాధిక, ధనలక్ష్మి, కనకం లలిత పాల్గొన్నారు.

ఐటీడీపీ అధ్యక్షుడుగా బెజ్జో ప్రదీప్

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం ఐటీడీపీ అధ్యక్షుడుగా బెజ్జో ప్రదీప్ నియ మితు లయ్యారు. సోషల్ మీడియా కార్యకర్తగా తెలుగుదేశం పార్టీ తరపున తరచూ అనేక కార్య క్రమాలు ప్రదీప్ చేపడుతున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలోను, అధికార పక్షం అమలు చేస్తోన్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలోను సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా పని చేస్తోన్న ప్రదీప్ సేవలను పార్టీ శ్రేణులు కొనియా డుతున్నారు. ప్రదీప్‌కు పదవి పట్ల కార్యకర్తలు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు యువత అధ్యక్షుడుగా పాపారావు

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం తెలుగుదేశం పార్టీ తెలుగు యువత అధ్యక్షునిగా కర్తలిపాలెం మాజీ సర్పంచ్ తామాడ పాపారావును నియ మించారు. గతంలో కర్తలి పాలెం సర్పంచ్‌గా పాపారావు చేశారు. మొదటి నుంచి ఆయన తెలుగుదేశం పార్టీలోనే క్రియాశీలక నాయకుడిగా పని చేశారు. పాపారావు ఎన్నిక పట్ల మండలంలోని టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

విశాలాంధ్ర - నందిగాం : మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని డెప్యూటీ ఎంపీడీవో టి.రాజారావు అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయ గదుల్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళిని దులిపి శుభ్రం చేశారు. అదే విధంగా చెల్లాచెదురుగా పడిన దస్త్రాలను సక్రమంగా అమర్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

విశాలాంధ్ర - కవిటి : కవిటిలోని ఎస్వీజే కళాశాల ఆవరణంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవంను ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లా డుతూ భారతదేశం 2023 ఆగస్టు 23న చంద్రునిపై అడుగు పెట్టిన 4వ దేశంగాను, దక్షిణ ధ్రువం చేరుకున్న తొలిదేశంగా అవతరించిని తెలిపారు. ఈ సందర్భంగా అంతరిక్ష రంగానికి ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.భాస్కర రావు, సంగీత, బి.జగ్గారావు, ఎన్ఎస్ఎస్ పీవోలు ఆర్.మహేష్, జి జగన్నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - నరసన్నపేట : గత ఎనిమిది రోజుల నుండి నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారంతో ముగిసాయి. పట్టణంలో గాంధీనగర్-3వ వీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, తలసముద్రం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభమైన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ప్రతీ రోజూ నిత్య పూజలు చేశారు.

పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి మేజర్ పంచాయితీ పారిశుద్ధ్య కార్మి కులను ఘనంగా సన్మానం చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యాక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 10 మంది పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ జాకెట్, గ్లౌజెస్ అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ ఈ రోజు దేశంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నారంటే, పారిశుద్ధ్య కార్మికుల చలవేనన్నారు. వేకువజామునే నిద్రలేచి, పట్టణాలను శుభ్రపరిచి, తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, ప్రజానీకానికి ఆరోగ్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, ఏఎంసి, చైర్మన్, పాగోటి ఉమామహేశ్వరీ, మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, బోయిన సతీష్, బతకల సంతోషి, గొలివి రామారావు, బెవర రాము, జామి వెంకటరావు, తాళాభక్తుల గోవిందరావు, పీస కృష్ణ సరిపల్లి మధుసూధనరావు, అడపా చంద్రశేఖర్, పూతి రమణ, బలగ ప్రహర్షకుమార్,పుచ్చల కల్పన, బతకల గోపి, సదాశివుని రాంబాబు, రావాడ గణపతిరావు, ఎంపిడిఓ, కె.వేంకటేశ్వరప్రసాద్, డిపూటీ ఎంపిడిఓ, ఎం.రేణుక, పంచాయితీ ఈ.ఓ, పి.ద్రాక్షాయిణి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రుల్లో సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని స్థానిక గాంధీ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ హనుమంతు సతీష్ అన్నారు. ఆయన ప్రతి ఏడాది కొన్ని వేల సంఖ్యలో మట్టి విగ్రహాలను తయారు చేయించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని వ్యాపార రంగాలు ప్లాస్టో ప్యాలస్ అనే కెమికల్ తో కూడిన పదార్థంతో విగ్రహాలను తయారు చేస్తారని, అవి ప్రజా ఆరోగ్యానికి ఎంతో ముప్పు వాటిల్లేందుకు కారణం అవుతాయన్నారు. వివిధ రకాల పెయింట్లు , ఛమ్కీలు వంటి హానికరమైన ముస్తాబులతో తొమ్మిది రోజులు మన ముందు ఉంచి, 9వ రోజు చెరువుల్లో, గెడ్డలో, నదిలోను వాటిని నిమజ్జనం చేసిన తర్వాత ప్లాస్ట ప్యాలెస్, ఇతర కెమికల్స్ అందులో కలుషిత మవుతున్నాయి అని, ఆ నీటిని మనం వినియోగించడం ద్వారా అనేక రకాల వ్యాధులు బారిన పడవలసి వస్తుందన్నారు. అయితే ఇటువంటి వాటిపై ప్రభుత్వాలే దృష్టిసాదించి కేవలం మట్టితో తయారుచేసిన విగ్రహాలని పూజించాలని నిబంధనను తీసుకురావాలని ఆయన కోరారు. ఇప్పటికే సమాజంలో వైద్యులకు అంతుచిక్కని రోగాల బారిన పడవలసి వస్తుందని, ఇంకా ఇటువంటి కెమికల్స్ వలన మరింత హాని జరగనుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఇటువంటి విషయాలను గుర్తించాలని మట్టి విగ్రహాలు తయారు చేసే కళాకారులు, వృత్తి నైపుణ్యం గలవారు మన మధ్యనే ఉన్నారని, వారిని వినియోగించుకొని మట్టి విగ్రహాలను తయారు చేసుకొని పూజించుకోవాలని ఆయన కోరారు.

వికలాంగుల పెన్షన్లు తొలగింపు అమానుషం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఏ పని చేసుకోలేక, ఎటువంటి జీవనాధారం లేక ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా జీవనం సాగిస్తున్న వికలాంగుల పెన్షన్లు అకస్మాత్తుగా తొలగించి వారిని రోడ్డున పడేయటం అమానుషమని వైఎస్ఆర్సిపి ఆముదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆముదాలవలసలో గల వైఎస్ఆర్‌సిపి నియోజ కవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతాడ రవికుమార్ మాట్లాడుతూ ఆముదాలవలస నియోజకవర్గంలో దాదాపు 450 మంది వికలాంగుల పెన్షన్లు తొలగించారని ఇందులో ఎంతోమంది గత 20 సంవత్సరములగా వికలాంగుల కేటగిరిలో పెన్షన్లు పొందుతున్నారని వారి పెన్షన్లు అక స్మాత్తుగా ఆపేయడం వారి జీవితాలను చిదిమేయడ మేనని రవికుమార్ అన్నారు. పెన్షన్లు పోయిన వారు మరల సంబంధిత ఎంపీడీవో కు అప్పీలు చేయాలని అప్పటికి న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా వైసిపి పార్టీ తరపున పోరాటం చేస్తామని చింతాడ రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాలవలస మున్సిపాలిటీ అధ్యక్షులు పొదుగు శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా ఇంటలెక్చువల్ ఫారం అధ్యక్షులు కొప్పలి ఈశ్వ రరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ దుంపల శ్యామ లరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, రాఘ వేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలోగల 38 గ్రామ వంచాయతీలలో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తే అనుమతులు తప్పని సరిగా పొందాలని సి.ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకోవాలని, అను మతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మండపాల నిర్వాహకులు వైబ్‌సైట్ల్లో ద్వారా సింగిల్ విండో విధానంలో అన్లైన్‌లో వినాయక చవితి త్సువాలకు అన్ని అనుమతులు పొందవచ్చుని అన్నారు. పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారుల బృందం పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. విగ్రహాలను పజ్రల రాకపోకలకు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, కమిటి సభ్యులు ఆధార్, అడ్రస్‌లు ఫోన్ నెంబర్లు విగ్రహాలు ఎత్తు, బరువు, పూజ దినములు వినాయక నిమజ్జనం చేసే సమయాలను, రూట్ మ్యాప్‌ను వివరములు తెలపాలన్నారు. ఆయన తో పాటు స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ ఉన్నారు.

సముద్రపు నాచుతో మంచి ఆదాయం

విశాలాంధ్ర - సోంపేట : సముద్రపు నాచు పెంపకం ద్వారా రైతులు లక్షాధికారులుగా మారవచ్చని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఈ మండలం మూలపొలం గ్రామంలో శనివారం డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సముద్రపు నాచును పెంచి మార్కెట్‌లో విక్రయించి మంచి ఆదాయం పొందాలని సూచించారు. కేవలం 25 సెంట్లు విస్తీర్ణంలో ఒక ఏడాది పాటు సముద్రపు నాచు సాగు చేయడం ద్వారా లక్ష రూపాయలకు పైగా సంపాదించవచ్చని పేర్కొన్నారు. ఈ నాచు సాగు చేయుటకు అవసరమైన వలను డిఆర్‌డిఏ సబ్సిడీ ధరకు అందజేస్తుందని అన్నారు. సముద్రపు నీటిని ఉపయోగించి సాగు చేయడం ద్వారా పెరిగిన నాచును మార్కెట్‌లో చేపల పెంపకానికి, టూత్‌పేస్ట్ తయారీకి, ఇతరత్రా ఉపయోగాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు. మంచి డిమాండ్ ఉన్న సముద్రపు నాచును పెంచేందుకు రైతులు ఆసక్తి చూపించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, మండల స్థాయి అధికారులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆహార సరఫరా విషయంలో భద్రత కరువు

విశాలాంధ్ర - జలుమూరు : పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిమ నెల ఉచిత నిత్యవసర సరుకులను అందిస్తుంది. నిబంధనలు అతిక్రమించి జలుమూరు మండలం గడ్డం నుండి బియ్యం సరఫరా జరుగుతున్నాయని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రానికి మారుమూలలో ప్రభుత్వ నిత్యవసర సరుకుల గిండగి ఏర్పాటు చేసి ఉన్నారు. అక్కడనుండి జలుమూరు సారవకోట మండల పరిధిలో అనేక గ్రామాలకు ప్రభుత్వ ఉచిత బియ్యం సరఫరా చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుండి మండలానికి చెందిన ఒకే ఒక గుత్తేదారుని ట్రాక్టర్ తో ఈ సరుకులు సరఫరా కావడం అవకతవకలకు చోటు చేసుకుంటుందని అనేక ప్రాంతాల్లో విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గిడ్డంగులో సరుకు రిలీజ్ చేసే సమయంలో సంబంధిత డీలర్ ఆ ప్రాంతానికి చెందిన గ్రామ సహాయకులు ఇతర వ్యక్తులు ఉండి ఆయా గ్రామాల డిపోలకు సరుకులు వాహనంపై తీసుకెళ్లవలసి ఉంది. అయినా దానికి భిన్నంగా ఈ వాహనంపై ఏ ఒక్కరు లేకుండా సరుకులు సరఫరా జరుగుతున్నాయి. మండల స్థాయి అధికారులు అనేకం జరుగుతున్నది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మండల సివిల్ సప్లై అధికారులు నిబంధనలు మేరకు సరకులు సరఫరా చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తపరిచారు.

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం ప్రతి ఒక్కరిది కావాలి

విశాలాంధ్ర - కవిటి : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం ప్రతి ఒక్కరిదీ కావాలని ఏపీడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ మురళీమోహనరావు బెహరా అన్నారు. ఈ మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని కవిటి మండలం బెలగాం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు మండల అధికారులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్ వన్ గా నిలపాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెలలో 3 వ శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. నెలకి ఒకటి చొప్పున 12 నెలలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామా పంచాయితీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాపులు, రైల్వేస్టేషన్లు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అంకితభావంతో భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడం, పిల్లలు, భవిష్యత్తు తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావులు, కుంటలు, చెరువులు, కాలువలు లోని వ్యర్థ పదార్థాలను తొలగించడంతోపాటు మెగా శుభ్రత డ్రైవ్ లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి పి ప్రవీణ్ కుమార్, ఏవో పి. శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద రావు, ఆర్ ఐ రమణమూర్తి, ఏపిఎం గోవిందరావు, హౌసింగ్ ఏఈ రఘు, ఏపీవో మోహన రావు, వివిధ శాఖ అధికారులు, కార్యదర్శులు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు పొందల కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, పిఏసిఎస్ అధ్యక్షులు యర్ర బాసు ప్రధాన్, సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, సంతోష్ పట్నాయక్, రంగా రౌల్లో, బాస్ దేవ్ రౌల్లో,మోహనరావు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటిలో : కవిటి మండల కేంద్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్ర పరిచారు. ఇందులో భాగంగా కళాశాల ప్రాంగణాన్ని శు భ్రపరిచి, అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. సింహాచలం నాయుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యదాయకమైన సమాజాన్ని నిర్మించుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ సీజన్లో అనేక వ్యాధులు పరిసరాలు అపరిశు భ్రంగా ఉండటం వల్లే సంక్రమిస్తాయని, వాటి నుంచి ఉపశమనం పొందాలంటే కళాశాల ప్రాంగణాన్ని, గృహ సముదాయాలను విద్యార్థులు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి, ఆరోగ్యదాయకమైన సమాజ నిర్మాణానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు స్వచ్ఛందంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చివరిగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఒ. జె. పాపారావు, అధ్యాపకులు జి. విష్ణుమూర్తి, పి. హరి, కె. ఉగాది నాయుడు, డి. అనసూయ, బి. శ్రీను బాబు, కె. కరుణశ్రీ, డి. రమేష్, జనార్ధన్ రావు, ఎల్. ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజీ.పుట్టుగలో : పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ఇన్చార్జ్ హెచ్ఎం బాబురావు అన్నారు. ఈ మేరకు శనివారం బిజీ పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాస కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచిననాడు పాఠశాల గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల ఆవరణంలో శనివారం ఉదయం శ్వాస కార్యక్రమాన్ని నిర్వహించి సాస ఆకృతిలో విద్యార్థులు చేసిన అక్షరమాల అందరిని ఆకట్టుకుంది. విద్యార్థులచే స్వచ్ఛంద స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంలో మనం కూడా భాగస్వాములమై పరిసరాలను ప్రతిరోజు పరిశు భ్రత చేసి శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు అందరి పై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేబీటి ఆధ్వర్యంలో ఉచిత వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర - జలుమూరు : కాలుష్య నియంత్రణ కోసం ప్రజలకు మట్టి విగ్రహాలను అందజేస్తున్నట్లు సారవకోట మండలం అవలంగి జేబిటీ పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ అన్నారు. గత 12 సంవత్సరాలుగా పాఠశాల ఆధ్వర్యంలో ఏడాదికి 1000 విగ్రహాలు ఉచితంగా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ ఉచిత విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు మోహన్ గాంధీ తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితి పర్వదిన సందర్భంగా పురస్కరించుకొని శనివారం నుండి పాఠశాల ఆవరణల ప్రజలకు అందజేస్తున్నట్లు తెలిపారు. నేటి నుండి మంగళవారం వరకు సరఫరా చేస్తామని ఆయన స్పష్టం చేశారు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీలో కొలువుల జాతర...

విశాలాంధ్ర - కవిటి : డీఎస్సీ ఉద్యోగుల తుది జాబితా ఫైనల్ అయింది. ఉద్యోగాన్ని చేజిక్కించుకున్న అభ్యర్థుల ఇంట తమ తల్లిదండ్రులు కొలువల పంటతో సంబరాలు చేసుకుంటున్నారు. దాదాపు ఏడు సంవత్సరాలుగా రాత్రింబవళ్లు చదివిన విద్యార్థులు ఉద్యోగులుగా మారిన వేళ వారి సంతోషానికి అవధులు లేవు. డీఎస్సీ ఫలితాలు విడుదల అనంతరం వచ్చిన మార్కులను బేరీజు వేసుకుంటూ ఎంతవరకు కటాఫ్ ఉంటుంది అనే సందిగ్ధంలో పది రోజులుగా కాలం వెళ్ళదీసిన డీఎస్సీ అభ్యర్థులకు శుభం కార్డు పడింది. అ కటాఫ్ తో వేరే జిల్లాలో రాసిన మార్పులను సరిపోల్చుకుంటూ అదృష్ట దరిద్రాలను లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు, కొన్ని చోట్ల మేలు జరగగా, మరికొన్ని చోట్ల నష్టం జరిగింది. పాయింట్ మార్పులతో కొలువు ను కోల్పోయిన కొంతమంది లబోదిబోమంటూ. విలపిస్తున్నారు..!! డీఎస్సీలో మెరిట్ సాధించి ఉద్యోగం ఫైనల్ చేసుకున్న అభ్యర్థులకు తమ సన్నిహితులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు చెబుతూ మఠాయిలు తినిపిస్తూ.. సంతోషాన్ని పంచుకుంటున్నారు. ఎస్‌జీటి, స్కూల్ అసిస్టెంట్, టిబిటి, ప్రిన్సిపాల్ పోస్టులకు వేర్వేరుగా మెరిట్ జాబితాలను ప్రభుత్వం గత రాత్రి ప్రకటించింది. త్వరలో వీరందరికీ జిల్లా విద్యాశాఖ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుపునిస్తారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ నెల చివరికి ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. మండలంలోని సిలగాం గ్రామానికి చెందిన పిరియా సురేంద్రబాబు సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ లో నాలుగవ ర్యాంకు, జోన్ వన్ పి జి టి సాంఘిక శాస్త్రం లో ఎనిమిదవ ర్యాంకు, జోన్ వన్ టి జి టి సాంఘిక శాస్త్రం లో 7వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ లో 87.069 మార్కులు, పి జి టీలో 72.50, టి జి టి లో 81.50 మార్కులు సాధించారు. కొండిపుట్టుగ గ్రామానికి చెందిన తలగాన చంద్రయ్య డిల్లమ్మ దంపతుల కుమారుడు తలగాన లోకనాథంకు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 14 వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తండ్రి వ్యవసాయం తల్లి గృహిణి. అలాగే లండారిపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు సోమయ్య, బాలమ్మ దంపతుల కుమారుడు నర్తు సుందర్ రావు కి మ్యాథమెటిక్స్ విభాగంలో 6వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తండ్రి వ్యవసాయ వృత్తి తల్లి గృహిణి. అదేవిధంగా బైరిపురం గ్రామానికి చెందిన పిరియా షర్మిల కర్నూలు జిల్లాలో ఎస్జీటీలో మెరిట్ సాధించి ఉపాధ్యాయునిగా ఎంపికయింది. రాజపురం గ్రామానికి చెందిన పత్రి సాయిరాజు పాత కొజ్జీరియా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ 2025 డీఎస్సీలో 27 ర్యాంకు సాధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలకు మ్యాథ్స్ అసిస్టెంట్‌గా ఫిజిక్స్‌లో 26 ర్యాంకు సాధించి ఫిజిక్స్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. మెరిట్ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు, బంధువులు అభ్యర్థులకు అభినందించారు.

నాణ్యతలు కరువై... రహదారులు గుల్లై

- కూటమి ప్రభుత్వంలో లక్షల రూపాయలతో ప్రధాన రహదారి అభివృద్ధి
- నాణ్యత, పర్యవేక్షణ లేకపోవడంతో లక్షల రూపాయలు వృదా పాలు
- కనీసం 6 నెలలు కాకముందే గుంతలు గుంతలు గా తయారైన రహదారి
- అభివృద్ధి పనులలో అధికారుల అవతావకలా
- ఇకనుండి రాష్ట్ర మంత్రి దృష్టి పెట్టాల్సిందేనా



విశాలాంధ్ర - టెక్కలి : రహదారి ఏర్పాటు మరియు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపడితే నాణ్యతతో సుమారు కొన్ని ఏళ్ల పాటైన ఉండాలి... అటువంటి పరిస్థితి ఇక్కడ కరువైంది. పనులు చేపట్టిన ఆరు నెలల లోపే రోడ్డు మళ్లీ గుంతలు మయంగా మారుతున్న పరిస్థితి కనబడుతుంది. ఎక్కడైతే రహదారి పనులు చేపట్టారో అదే స్థలంలో మళ్లీ గుంతలు ఏర్పడి రహదారి ప్రమాదకరంగా మారుతుంది. ఈ పరిస్థితి టెక్కలి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇందిరాగాంధీ కూడలి నుండి అంబేద్కర్ కూడలి మార్గంలో చోటుచేసుకుంది. కొన్ని సంవత్సరాలుగా రహదారి గుంతలుగా మారింది. గత ఐదు సంవత్సరాలలో ఆ రహదారిని గత ప్రభుత్వం పట్టించుకోకపోయిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆ రహదారికి నిర్మాణ పనులు చేయించాలని లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. అయితే ఉన్న రోడ్డు పైనే మరళ రోడ్డు వేయడంలో నాణ్యత లోపం వలన నేడు ఆ రహదారి మళ్లీ గుంతలు గుంతలుగా మారుతున్న పరిస్థితి. రహదారికి ఇరువైపులా ఉన్న షాపులు వద్ద పెచ్చులు పెచ్చులుగా ఊడుతూ మార్గం మధ్యలో మళ్లీ గుంతలుగా మారుతుంది. రహదారి నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడం నాణ్యత కరువై ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాలకే రోడ్డు పరిస్థితి ఇలా ఉందంటే ఆ పనుల్లో నాణ్యత ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. పనులు నిర్వహణ సమయంలో ఉన్నత అధికారులు పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, లక్షల రూపాయలు రోడ్డు నిర్మాణంలో వృధాపాలు అయ్యాయని స్థానిక ప్రజలు ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇకనుండి అయినా కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వయంగా దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ఇన్నాళ్లూ ఓ నరకం ... ఇప్పుడు మరో భయం..

- ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్య ఫలితం..
- కాంట్రాక్టర్ కక్కుర్తి మరో కారణం..
- పక్క రోడ్డు పూర్తి స్థాయిలో..నిర్మించకుండానే ప్రారంభం
- వాహనచోదకులలో భయం..భయం..!

విశాలాంధ్ర - పలాస : గత కొన్నేళ్లుగా గజానికో గుంతతో వాహనచోదకులకు, పాదచారులకు ఇక్కట్లు పాలుజేసిన పర్లాఖిమిడి.. బెండి గేటు రహదారి ఎన్నికల ముందు కొంత పూర్తి చేసి అక్కడక్కడ వదిలేసిన పనులు తాజాగా ప్రారంభించి కొత్తరకం నరకాన్ని చూపిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి పర్లాఖిమిడి వెళ్లే రహదారిలో టెక్కలిపట్నం పంచాయతీ కేంద్రం నుంచి చర్చి వరకు ఓ అర కిలోమీటరు పనిని వదిలేశారు. దీంతో పెద్ద, పెద్ద గుంతలతో వాహనాలు నడిపే వారినే కాకుండా పాదచారులను భయపెడుతుండేవి. ఈ రహదారిలో పర్లాఖిమిడి నుంచి పలాస వైపు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రయివేటు, ఆర్టీసీ బస్సులు తిరుగుతూనే ఉంటాయి. వీటికి తోడు ఆటోలు, వ్యాన్లు లెక్కేలేదు. ఇక గ్రానైట్ లారీలు, ప్రయివేట్ వాహనాలు రద్దీ కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో తాజాగా టెక్కలిపట్నం జంక్షన్ నుంచి సిమెంట్ రహదారిని ఓ వైపు వేశారు. ఈ రహదారికి రెండడుగుల లోతులో రెండు వైపులా ఎడ్జ్ లు ఉన్నాయి. ఓ వైపు రెండో రోడ్డు వేయాలి కాబట్టి ఎడ్జ్ అలానే ఉంటుంది..కానీ ఇంకోవైపు ఎడ్జ్‌ను మట్టి, గ్రావెల్ వేసి గట్టిగా చేయాలి. కానీ తూతూమంత్రంగా మట్టి వేసి వదిలేశారు..అది కూడా కొన్ని దగ్గర్ల వేసి మరికొన్ని దగ్గర్ల వదిలేయడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా భయపడుతున్నారు. ఒకే రహదారి కావడంతో వాహనాలు ఎదురెదురు పడిన సమయంలో ముచ్చె మటలెక్కుతున్నారు. దీంతో వాహన చోదకుల మధ్య రోజుకు పది, పదిహేనుసార్లు ఘర్షణ, వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు గుత్తేదారుడు మీనమేషాలు లెక్కబడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ జోగారావు వద్ద ప్రస్తావించగా ఎడ్జ్‌ల్లో గ్రావెల్ వేయాలని, సంబంధిత కాంట్రాక్టర్ మట్టి వేశారని, తామేమీ చేయలేమని వివరణ ఇచ్చారు. రద్దీగా ఉన్న ఈ రహదారి కి ఎప్పుడు మోక్షం కలుగుతుందో..!

విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అవసరం

విశాలాంధ్ర - జలుమూరు : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవ కోరారు. శనివారం జలుమూరు మండలం ఎలమంచిలి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ప్రైవేటు పాఠశా లలకు దీటుగా ఉత్తీర్ణత శాతం మార్కులు సంపాదిస్తున్నామని కనుకనే ఉపాధ్యాయులు మరింత కృషితో విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని అన్నారు.

29 నుంచి మహిళలకు మగ్గం వర్క్ ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు మగ్గం వర్క్‌పై ఈ నె 29వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తా మన్నారు. శారీస్, బ్లౌజులు, డ్రెస్సులపై డిజైన్స్ నేర్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 19-45 ఏళ్ల లోపు వయసు గల మహిళలు మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 7993340407, 9553410809కు సంప్రదించాలన్నారు.

వైసీపీ రాష్ట్ర బీసీ కార్యదర్శి నరేంద్రకు ఘన సన్మానం

విశాలాంధ్ర - సోంపేట : వైసీపీ రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శిగా నియమితులైన సీనియర్ నేత నర్తు నరేంద్ర యాదవ్‌కు పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, జెడ్పీటీసీ తడక యశోద శనివారం పలాసపురంలో ఘనంగా సన్మానించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా నరేంద్రను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, శిలగాన భాస్కరరావు, స్థానిక ఎంపీటీసీ పాల్గొన్నారు.

కూటమి తీరుపై వైసీపీ ఆగ్రహం:

ఈ సందర్భంగా నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైసీపీ నేతలు కూటమి సర్కార్ తీరును తీవ్రంగా విమర్శించారు. పథకాల అమలులో పారదర్శకత లేకపోవడం, హామీలిచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబు ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతన్నకు ఎరువులు దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పలాసపురంలో పండగ

విశాలాంధ్ర - సోంపేట : పలాసపురం గ్రామంలో ఇద్దరు అభ్యర్థులు మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో ఆ గ్రామంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థి దశ నుంచి ఎంతో అంకిత భావంతో చదువుల పట్ల శ్రద్ధతో కష్టపడి చదివిన దుద్ది సంధ్య తెలుగు సబ్జెక్టులో జిల్లాలో 6వ ర్యాంకు సాధించింది. అదే గ్రామం నుంచి బీన సురేష్ గణితం సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో 16వ ర్యాంకును సాధించారు. జింకిభద్ర గ్రామం నుంచి బయాలజీలో సోషల్ అసిస్టెంట్‌గా కె.హరిత 12వ ర్యాంకు సాధించింది. జగతి కేశుపురం నుంచి కడగల దేవి జిల్లాస్థాయిలో 19వ ర్యాంకు సాధించింది. వీరందరినీ బంధువులు, స్నేహితులు ఆయా గ్రామస్తులు అభినందిస్తున్నారు.

సంచార జాతుల విముక్త దినోత్సవ కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో మరియు బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగోల గోపి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆగస్టు 30వ తేదీన విజయవాడలో జరుగు సంచార జాతుల విముక్త దినోత్సవం మరియు సంచార జాతుల సభ నిమిత్తము టెక్కలి మండలంలో అక్కవరం గ్రామంలో నివసిస్తున్న బేడా, బుడగ, జగ్గాం పెద్దలను కలిసి జాతుల వారికి ఆగస్టు 30వ తారీఖున జరగబోవు స్ఫూర్తి కార్యక్రమం యొక్క బిజెపి నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. సంచార జాతులుకు కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న ఎస్ఈఈడి పథకం మరియు డిఎన్టి కమిషన్ ఏర్పాటు అదేవిధంగా కులవృత్తులు చేసుకోవడానికి బ్యాంకు నుండి రుణాలు, కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ, జనరల్ సెక్రెటరీ నేతింటే రాజారావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జన్నీ పరమేశ్వరరావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యత

విశాలాంధ్ర - టెక్కలి : మన చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐతమ్ కళాశాల డైరెక్టర్ వివి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొఱుసుల కొత్తూరు గ్రామంలో ఎన్ ఎస్ ఎస్‌వోస్వి. మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ ఆంధ్ర -స్వచ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో ఉన్న ప్రజలకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పలు సూచనలు గురించి వివరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ వివి నాగేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతని, మానవుని వ్యక్తిగత జీవితంలో ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.శాంతికుమార్, వి గోపాలకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఎచ్చెర్లను సాధిద్దాం : ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్లో భాగంగా స్వచ్ఛ ఎచ్చెర్లను అందరి భాగస్వామ్యంతో సాధిద్దామని స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛంద్ర సాధిద్దామని చెప్పారు. గ్రామ గ్రామాన పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టి, అపరిశుభ్రం వల్ల కలిగే ఇబ్బందులను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అలాగే అధికారులు, విద్యార్థులు, కూటమి నేతలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, కూటమి నేతలు బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు, గాలి వెంకటరెడ్డి, మూకళ్ల భాస్కరరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్పై ప్రతిజ్ఞ చేశారు.

కార్యాలయాల చుట్టూ అవాంచిత మొక్కల తొలగింపు

విశాలాంధ్ర - హిరమండలం : శనివారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వెలుగు కార్యాలయం, తహసీల్దార్, హిర మండలం గ్రామ పంచాయతీ, ఎంఆర్‌సి, ఎన్ ఆర్ ఈజీఎస్, హౌసింగ్ తదితర కార్యాలయాల చుట్టూ, కార్యాలయాల పైన ఉన్న పిచ్చి మొక్కలు, అవాంచిత మొక్కలను తొలగించి నిల్వ ఉన్న వర్షం మురికి నీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని హిరమండలం పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి మూల భాస్కర్ రావు విలేకరుల కు తెలిపారు. పారిశుధ్య కార్మికులతో చెత్త చెదారం ను తొలగించడం జరిగిందని ఈఓ తెలిపారు. ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు, ఈఓపిఆర్డీ డి.గోవిందరావుల పర్యవేక్షణ లో పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని ప్రతీ ప్రభుత్వ కార్యాలయల్లోను సచివాలయల్లోను పరిశుభ్రం గా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ మండపాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - పోలాకి : గణేష్ ఉత్సవాల లో భాగంగా ఈనెల 27 జరుగనున్న వినాయక చవితి పండగ సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసుకున్న గణేష్ పందిళు మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని కమిటీ వారు ఆన్లైన్లో అనుమతులు పొందాలని పోలాకి సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే నిర్వాహకులు ముందుగా ఒక కమిటీ ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగల్ విండో విధానంతో అనుమతులు పొందాలని అన్నారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా గ్రామ కమిటీ నిర్వహించాలని తెలిపారు. గ్రామ ప్రాంతాల్లోఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించుకోవడానికి, ఇప్పటికే పోలీసు శాఖ జారీ చేసిన నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలని పోలాకి సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ కోరారు. ప్రతీ మండపం వద్ద సి సి కెమెరాలు పెట్టుకోవాలి. ప్రతీ రోజు రాత్రి కనీసం ఇద్దరైన మండపం వద్ద పడుకోవాలి. ప్రభుత్వ స్థలాల్లో పెడితే గ్రామ స్థాయి ప్రభుత్వ అధికారుల వద్ద అనుమతి తీసుకోవాలి. ప్రైవేటు స్థళ్లలో పెడితే వారి పర్మిషన్ తప్పనిసరి అని అన్నారు. గణేష్ నిమగ్న ఊరేగింపు రాత్రి 10 గంటలు వరకు మాత్రమే అధిక మొత్తం లో సౌండ్స్ పెట్టకూడదని హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్.ఐ రంజిత్ ప్రకటించారు.